E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



నీట్ పీజీ కటాఫ్ తగ్గింపుపై కేంద్రానికి సుప్రీం నోటీసు » 3లో

హైదరాబాద్ (తేదీ) 05-02-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక: 35|| పేజీలు–6 www.ekaburu.com

## అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలి



- ఉచిత బస్సు ప్రయాణం చేసిన మహిళలు అందరూ ఓటేస్తే భారత రాష్ట్ర సమితి, భాజపాలకు డిపాజిట్లు కూడా రావు
- మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు కేటాయిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మిర్యాలగూడ మండలం గూడూరులో ప్రజాపాలన ప్రగతిబాట సభ

ఈ కబురు, నల్గొండ:

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ గెలవాలని.. రాష్ట్రంలోని అన్ని నగర, పురపాలికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరులో బుధవారం జరిగిన ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ రఘువీర్‌రెడ్డిలతో కలిసి గూడూరు గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు మంత్రి ఉత్తమ్‌తో పాటు ఎమ్మెల్యేలు ఘనంగా స్వాగతం పలికారు. నేరుగా సభా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా రూ.200 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా' సమీకృత గురుకుల భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. "మేం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలోని 3.15 కోట్ల మందికి ఉచితంగా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యం తింటున్న వారందరూ తప్పకుండా కాంగ్రెస్‌కు ఓటేయాలి. నాటి సీఎం కేసీఆర్.. వరి సాగుచేసిన రైతుల వల్ల రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని.. 'వరి వేసుకుంటే ఉరి' అని చెప్పి ఆయకట్టు రైతులను అకారణంగా అప్పులపాలు చేశారు. మా ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేందుకు క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 85.31 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం.

తరువాయి 2లో

## రేవంత్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు



- సనాతన ధర్మంపై దాడులు పెరుగుతున్నా చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- పురపాలిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు తెలంగాణ భవిష్యత్తుకే
- ప్రధాని మోదీకి రాష్ట్రంపై ఎంతో మమకారం..
- మహబూబ్‌నగర్ సభలో భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా

ఈ కబురు, మహబూబ్‌నగర్ :

పురపాలిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపు అధికారం కోసం కాదని, తెలంగాణ భవిష్యత్తు కోసమేనని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా అన్నారు. తెలంగాణలో దుష్టపాలన కొనసాగుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు..

అంటే కాంగ్రెస్' అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు అందుకు నిదర్శనమన్నారు. మైనార్టీల ఓట్ల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు నిధులు తగ్గిస్తున్నారని ఆక్షేపించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో నిర్వహించిన 'విజయ సంకల్ప సమ్మేళనం'లో ఆయన కీలకోపన్యాసం చేశారు. 'తెలంగాణ గడ్డకు రావడం గర్వంగా ఉంది. శక్తి పీఠమైన జోగులాంబ అమ్మవారికి, తుంగభద్ర తీరాన వెలసిన నవబ్రహ్మ ఆలయాలు, మైసిగండి కాళికాదేవి, ఉమామహేశ్వరాలయాల్లో వెలసిన దేవతలకు ప్రణామాలు. తెలంగాణ ముక్తి కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు నివాళులు. రాష్ట్రం నుంచి పద్మ పురస్కారాలు అందుకున్న చంద్రమౌళి, కృష్ణమూర్తి, బాలసుబ్రహ్మణ్యం, వెంకట్రావు, విజయానంద్‌రెడ్డిలకు అభినందనలు' అంటూ ప్రసంగం ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని తెలిపారు. పారదర్శకంగా వక్ఫ్ చట్టాలు సవరించేందుకు ప్రధాని మోదీ నడుం బిగించారని, తెలంగాణలో మాత్రం రూ.లక్షల కోట్ల విలువైన 77 వేల ఎకరాలు వక్ఫ్‌కే అప్పగించారని నితిన్ నబీన్ ఆరోపించారు.

తరువాయి 2లో

## మతం పేరుతో రెచ్చగొట్టాలని చూస్తున్న భాజపా

- నితిన్ నబీన్ రాక అందులో భాగమే
- మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క స్థానం కూడా
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



ఈ కబురు, హైదరాబాద్: 'మున్సిపల్ ఎన్నికల్లో భాజపా ఒక్క స్థానం కూడా గెలిచే అవకాశం లేదు. మతం పేరుతో రెచ్చగొట్టి లబ్ధిపొందే ప్రయత్నం చేస్తోంది.

తరువాయి2లో

రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా తెలంగాణ కోసం పోరాడారా? **హరీశ్‌రావు** 3లో



జగిత్యాల ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్.. కొట్టివేసిన **స్పీకర్** 3లో



## జనంపై 'సర్' బుల్డోజర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- విచారణ సోమవారానికి వాయిదా
- వాదనకు 5 నిమిషాలడిగితే 15 నిమిషాలిచ్చిన కోర్టు
- ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని సీజేఐ వ్యాఖ్య



ఈ-కబురు, న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే సక్రమంగా జరగట్లేదని, పనిఒత్తిడితో బూత్ లెవల్ అధికారులు బలవన్మరణాలకు

తరువాయి2లో

## దివాలా కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులా?

- సీఎం సమాధానం చెప్పాలి
- దీని వ్యవహారాలపై వారం క్రితమే సుప్రీం నోటీసులు
- ఈ కంపెనీకి.. సీఎం బంధువుల సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు
- రేవంత్‌ను కేంద్రమే కాపాడుతోంది..
- లేకుంటే దీనిపై విచారణ జరిపించాలి
- కేటీఆర్ డిమాండ్





ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో సుమారు రూ.6 వేల కోట్ల పనులను ఒక దివాలా కంపెనీకి కట్టబెట్టారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. 2023లోనే దివాలా తీసిన ఈ సంస్థలో కొనసాగుతున్న రూ.వందల కోట్ల ఆర్థిక లావాదేవీలపై నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టు వారం కిందటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చిందని తెలిపారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీ సంస్థ అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తరువాయి2లో



## అణ్వాయుధాలు.. 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

ఈ కబురు; అమెరికా-రష్యా అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం ఫిబ్రవరి 5తో ముగియనుంది. దీంతో అణ్వాయుధ నిల్వలపై ఉన్న పరిమితులు తొలగిపోనున్నాయి. ఈ ఒప్పందం ముగింపు అనేది అణ్వాయుధ పోటీకి దారితీయొచ్చనే భయాలు మొదలవుతున్నాయి. అయితే, అమెరికా ఈ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ముందుకొస్తే.. తాము కూడా మరో ఏడాది పాటు దీనికి కట్టుబడి ఉంటామని రష్యా అధ్యక్షుడు ఇటీవల ప్రకటించారు. కానీ, ట్రంప్ యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. దీనిపై సరైన సమయంలో అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ వర్గాలు ప్రకటించాయి. తరువాయి2లో

## ప్రభుత్వం భయపడుతోంది నరవణె పుస్తకంపై ప్రియాంక గాంధీ



ఈ కబురు,నెట్‌వర్క్


భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తారన్నారు.

తరువాయి2లో

## కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి ..మండిపడ్డ బండి సంజయ్

ఈ కబురు, సిరిసిల్ల ;

రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి అంటూ మండిపడ్డారు. గాంధీ భవన్‌లో పార్టీ ఫిరాయింపుల సంసారం పెట్టారని.. అది కనిపించడం లేదా అని స్పీకర్‌ను సంజయ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. ప్రచారంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. గాంధీ భవన్‌కు ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్తున్నారని.. జిల్లా కాంగ్రెస్ ఆఫీసు మీటింగుల్లో.. వాళ్లే బీఫాంలు పంచుతున్నారని అన్నారు. "స్పీకర్ గారు అయినా మీ కళ్లకు కనిపించడం లేదా? స్పీకర్ పదవికి మచ్చ తేవడం న్యాయమేనా? ప్రజలారా.. ఓట్ల కోసం వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలను నిలదీయండి. వాళ్లు ఏ పార్టీలో ఉన్నారు..



తరువాయి2లో

# అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలి

మొన్నటి సీజన్‌లో కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా కింద వారి ఖాతాల్లో జమ చేశాం. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మరో రూ.9 వేల కోట్లు కేటాయిస్తాం. దేశంలో రూ.1.10 లక్షల కోట్ల మేర కేవలం రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. మిర్యాలగూడ 'రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ'గా పేరొందింది. మిర్యాలగూడలో రూ.294 కోట్లను మౌలిక వసతులకు కేటాయించాం. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసిన మహిళలు అందరూ ఓటేస్తే భారత రాష్ట్ర సమితి, భాజపా అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావు.

**––అమరవీరులే అసలైన జాతిపితలు**

పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం దోచుకుంది. ఇది సరిపోదంటూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇంట్లో భార్యాభర్తలు మాట్లాడుకుంటుంటే వారి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఆ ప్రభుత్వం చేసిన దిక్కుమాలిన పనికి నోటీసులు ఇస్తే తెలంగాణ జాతిపితకు సిట్ నోటీసులు ఇచ్చిందని అనడం హాస్యాస్పదం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపిస్తే రాష్ట్ర ప్రజలకు అవమానమని.. ఆ నోటీసులు తెలంగాణ ప్రజలకు ఇచ్చినట్లేనని గులాబీ నేతలు ప్రకటించడం సిగ్గుచేటు. మీకు నోటీసులు ఇస్తే తెలంగాణకు ఇచ్చినట్లైతే..మరి ఎర్రవల్లి, ధన్వాడ, మెదక్‌లలో ఉన్న ఫామ్‌హౌస్‌లు మీవి కావు.. రాష్ట్ర ప్రజలవే అవుతాయి. ఉద్యమంలో అసువులుబాసిన అమరవీరులే అసలైన జాతిపితలు'' అని సీఎం పేర్కొన్నారు.

**––మంత్రుల ప్రసంగం సాగిందిలా...**

బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ మధ్య జాతిపిత అంటూ కొందరు బయల్దేరారని... అసలు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కొనియాడారు. నల్గొండ ముద్దుబిడ్డ శ్రీకాంతాచారి, యాదయ్య వంటి వేల మంది ఉద్యమంలో ఆత్మార్పణ చేసుకున్నారని.. వారందరూ అసలైన ఉద్యమకారులని అన్నారు. నల్గొండ కార్పొరేషన్‌ను 'సూపర్ స్మార్ట్ సిటీ'గా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి సీఎం కేసీఆర్.. 2021 ఫిబ్రవరి 10న నెల్లికల్, బొత్తలపాలెం, దున్నపోతుల గండి, కేశవాపురం ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేసి సంవత్సరంలోగా పూర్తి చేస్తామని చెప్పారని... 5 శాతం పనులు కూడా చేయలేదన్నారు. తమ హయాంలో గరిష్ఠంగా 40వేల ఎకరాల ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఎన్నెస్పీ ప్రధాన కాలువకు పూర్తిగా నిధులు కేటాయించి ఆధునికీకరిస్తామన్నారు.

న్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రకటించడమే కాకుండా విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.

**––నాడు ఎస్ఎల్‌బీసీని విస్మరించిన భారత రాష్ట్ర సమితి**

నల్గొండ జిల్లాలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 30 కిలోమీటర్ల మేర తవ్వింది. తర్వాత అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి కిలోమీటర్ మేర పనులు కూడా చేపట్టలేదు. మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన భారత రాష్ట్ర సమితి సర్కారు పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకొని పెండింగ్ పనులు పూర్తి చేస్తోంది. భారత రాష్ట్ర సమితి వారు ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు? అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**––మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును వదిలేది లేదు**

''మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఒకప్పుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి అనుచరుడు. కాంగ్రెస్‌ను మోసం చేసి భారత రాష్ట్ర సమితి కండువా కప్పుకొని ఎమ్మెల్యేగా ఆయన ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో తాకట్టు పెట్టారు. ప్రస్తుతం నామినేషన్ల దాఖలు సమయంలో కాంగ్రెస్ నాయకులను బెదిరించి, ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేశారు. కాంగ్రెస్ నాయకులు వాటికి భయపడకుండా ధైర్యంగా నామినేషన్లు వేశారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడ్డ భాస్కర్‌రావును వదిలేదే లేదు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బాలునాయక్, జైవీర్‌రెడ్డి, వీరేశం, సామేల్, డాక్టర్ వంశీ కృష్ణ, పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీహెచ్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత పాల్గొన్నారు.



# దివాలా కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులా?



'2018లో ఈ కంపెనీపై, ప్రస్తుత ముఖ్యమంత్రి బంధువుల కంపెనీలపై ఐటీ దాడులు జరిగాయి. అప్పుడే అవి రేవంత్ బంధువుల కంపెనీలని బయటపడింది. ఆయా సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఆ ఇన్‌ఫ్రా కంపెనీ పేరుతో కొనుగోలు చేసిన ల్యాండ్ క్రూయిజర్ కారును ముఖ్యమంత్రి అయ్యాక కూడా రేవంత్ వాడుకున్నారు. ఈ కంపెనీకి మరో సంస్థకు మధ్య 2023లో గొడవ జరిగింది. ఆ రెండూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను అప్రోచ్ అయ్యాయి. ఆ కేసు నడుస్తోంది. అక్కడ ఈ కంపెనీ 'కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్' పిటిషన్ వేసి... తాము దివాలా తీశామనే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి రూ.15 లక్షలు కూడా లేవని చెప్పి.. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంది. దీంతో ఈ కంపెనీలో ఆర్థిక లావాదేవీలను ఎన్‌సీఎల్‌టీ నిషేధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న కంపెనీకి... రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమృత్ స్కీమ్, జల్‌జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్ట్ పనులు, రహదారుల పనులు... కలిపి సుమారు రూ.6,000 కోట్ల కాంట్రాక్టులను అడ్డగోలుగా కట్టబెట్టారు. 2023లో దివాలా తీసిన కంపెనీకి.. 202426 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం ఇన్ని కాంట్రాక్టులు ఎలా ఇచ్చిందన్న విషయానికి సీఎం సమాధానం చెప్పాలి? ఈ కంపెనీ ఆర్థిక అవకతవకలపై సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్, ఈడీలతో విచారణ జరిపించాలని కేంద్రానికి, రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చినా... ఎందుకు దర్యాప్తునకు ఆదేశించలేదు? ఈ అంశాన్ని దాచిపెట్టి.. ప్రజల దృష్టిని మళ్లించడానికే నాతోపాటు హరీశ్‌రావు, సంతోష్‌రావు, కేసీఆర్‌లకు సిట్ నోటీసులిచ్చి డ్రామా నడిపించారు. ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం కాపాడుతుంది నిజం కాకపోతే... ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలి. విచారణ పూర్తయ్యే వరకూ ఈ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి.. ఇచ్చిన కాంట్రాక్టులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మతం పేరుతో రెచ్చగొట్టాలని చూస్తున్న భాజపా



ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక అందులో భాగమే' అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో 8 మంది భాజపా ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమి ఒరిగిందో చెప్పాలని నితిన్ నబీన్‌ను డిమాండ్ చేశారు. 'విభజన చట్టం ప్రకారం తెలంగాణకు న్యాయంగా రావాల్సిన పథకాలను, నిధులను, ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయడం లేదు. జీడీపీలో తెలంగాణ వాటా 5.01%. ఆ లెక్కన కేంద్రం నుంచి తెలంగాణకు దక్కాల్సిన వాటా రావడం లేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీకి డిపాజిట్ రాలేదన్న విషయాన్ని నితిన్ నబీన్ తెలుసుకోవాలి. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్‌కు ఓటేసి మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలి'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర ప్రజలకు విన్నవించారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 'మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడా కాంగ్రెస్ రెబల్స్ బరిలో లేరు. బీసీలకు 50 శాతానికిపైగా బీ ఫాంలు ఇచ్చాం' అని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించారు.

**––భాజపా నేతలు పవన్‌కల్యాణ్‌ను ప్రాధేయపడ్డారు**

సినీ నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణలో ప్రచారం చేస్తారన్న ప్రకటనపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. 'పవన్... తెలంగాణ వ్యతిరేకి, గతంలో తెలంగాణ గురించి అనుచితంగా మాట్లాడారు. ఆయన చెబితే ఇక్కడ ఎవరూ ఓట్లు వేయరు. తెలంగాణలో భాజపాకు దిక్కు లేక, ఆ పార్టీ నేతలు పవన్‌కల్యాణ్‌ను ప్రాధేయపడ్డారు' అని పేర్కొన్నారు.

# ప్రభుత్వం భయపడుతోంది
## నరవణె పుస్తకంపై ప్రియాంక గాంధీ



ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు.

--నరవణె పుస్తకాన్ని ప్రదర్శించిన రాహుల్..

ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

--నాకు ద్రోహం చేసిన స్నేహితుడు: రాహుల్

పార్లమెంటు ప్రాంగణంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టుల మధ్య చిన్న వాగ్వాదం జరిగింది. పార్లమెంటు ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్నారు. అదే సమయంలో కేంద్ర మంత్రి అటుగా రాగా.. 'ఇదిగో ఇక్కడ ఓ ద్రోహి నడుచుకుంటూ వెళ్తున్నాడు' అంటూ రాహుల్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో బిట్టుకు కరచాలనం చేయడానికి ముందుకొస్తూ.. ''ద్రోహి స్నేహితుడా'' అంటూ చురకలంటించారు. నువ్వు తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తావంటూ ఎద్దేవా చేశారు. దీనికి కేంద్ర మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌తో కరచాలనం చేసేందుకు నిరాకరిస్తూనే.. 'మీరు దేశానికి ద్రోహం చేశారు' అని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన బిట్టు.. 2024 ఎన్నికల ముందు భాజపాలో చేరారు.

# జనంపై 'సర్' బుల్డోజర్

పాల్పడుతున్నారని, బాధితులను ఢిల్లీకి తీసుకొచ్చి బెంగాల్ అంశాన్ని హస్తిన వేదికగా చర్చనీయాంశంగా మార్చిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఈ అంశంపై నేరుగా సర్వోన్నత న్యాయస్థానంలో తన వాదనలు స్వయంగా వినిపించారు.

ఐదు నిమిషాలు సమయం ఇస్తే సూటిగా, స్పష్టంగా తమ వాదనలను విన్పిస్తానని మమత కోరగా ధర్మాసనం ఏకంగా 15 నిమిషాల సమయం కేటాయించడం విశేషం. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా స్వయంగా ముఖ్యమంత్రి సుప్రీంకోర్టులో రాష్ట్ర కేసును వాదిస్తుండటంతో ఆమె వాగ్ధాటిని వినేందుకు న్యాయవాదులు సీజేఐ కోర్టురూమ్‌లోకి ఎగబడ్డారు. ఈ ఘటనకు సర్వోన్నత న్యాయస్థానం వేదికైంది.

ఈసీ ఒక వాట్సాప్ కమిషన్..

తమ రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ మమతా బెనర్జీ, మొస్తారీ బానూ, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియాన్, దోలాసేన్‌లు వేసిన పిటిషన్‌పై తానే స్వయంగా వాదనలు విన్పించేదుకు అనుమతించాలంటూ ఇప్పటికే మమత ఇంటులాక్యుటరీ పిటిషన్ వేశారు. దీంతో మమతను వాదనలకు కోర్టు అనుమతించింది. మమత తన వాదనల సందర్భంగా ఎన్నికల కమిషన్‌ను వాట్సాప్ కమిషన్‌గా అభివర్ణించారు.

'' ఈసీ ఒక వాట్సాప్ కమిషన్. ఉన్నతాధికారులకు కీలక నిర్ణయాలను వాట్సాప్‌లలో పంపిస్తోంది. మా రాష్ట్రంలో అక్రమంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోవాలి. ఎన్నికల నేపథ్యంలోనే మా రాష్ట్రాన్ని ఈసీ లక్ష్యంగా చేసుకుంది. ఓటర్లపై ఈసీ 'ఎస్ఐఆర్' బుల్డోజర్‌తో తొక్కిస్తోంది. ఎస్ఐఆర్ పేరిట బూత్ లెవల్ అధికారులను ఈసీ అధికా రాలు వేధిస్తున్నారు. వేధింపులు, పని ఒత్తిడితో పెద్దసంఖ్యలో బీఎల్ఓలు ఆత్మహత్యచేసుకున్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని మీరే కాపాడాలి. ఈ కేసులో న్యాయం కోసం మొదట్నుంచీ మా లాయర్లు శతథా పోరాడుతున్నారు. అయినా సరే మాకు ఎక్కడా న్యాయం దక్కట్లేదు. నేను కూడా కట్టుబానిసను. సాధారణ కుటుంబం నుంచి వచ్చా. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడట్లేను. రాష్ట్ర ఓటర్ల ఓటింగ్ హక్కుల కోసం పోరాడుతున్నా. ఇదే విషయమై ఇప్పటికే ఆరు సార్లు ప్రధాన ఎన్నికల కమిషన్ వద్ద మొరపెట్టుకుంటూ లేఖలు రాశా. అయినాసరే ఎలాంటి స్పందన రాలేదు. స్పెల్లింగ్‌లో చిన్నచిన్న తప్పులను ఎత్తిచూపి కోట్లాది ఓట్లను తొలగించొద్దు. ఇతర డాక్యుమెంట్లు అడక్కుండా ఎస్ఐఆర్ వెరిఫికేషన్‌లో ఆధార్‌కార్డ్‌ను గుర్తింపుకార్డుగా అంగీకరించండి'' అని మమత కోరారు.

దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం స్పందించింది. ''మీరు చేస్తున్న వాదనల్లో నిజం ఉంది. అయితే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది'' అని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ఫిబ్రవరి 9వ తేదీ(సోమవారం) కల్లా మీ స్పందన తెలపాలని ఎలక్షన్ కమిషన్‌కు, పశ్చిమబెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారికి నోటీసులు జారీచేసింది. బీఎల్ఓలు, ఎలక్టొరల్ రోల్ ఆఫీసర్లతో సున్నితంగా వ్యవహరించాలని, వాళ్లకు నోటీసులు జారీచేసే ముందు ఆలోచించాలని ఈసీకి ధర్మాసనం సూచించింది. కేసు విచారణ సోమవా రానికి వాయిదా వేశారు.

ఎందుకింత తొందర?

''ఎస్ఐఆర్ సర్వేను సమగ్రంగా, సంపూర్ణంగా చేయాలంటే కనీసం రెండు సంవత్సరాలు పడుతుంది. కానీ హడావుడి గా కేవలం మూడునెలల్లో ముగించాలని ఎందుకు నిర్ణయించారు? ఇదే సమయంలో రాష్ట్రంలో పండగ సీజన్ ఉంది. పంటల సాగు నడుస్తోంది. అంతా బిజీగా ఉండే సమయంలో హడావిడిగా ఎస్ఐఆర్ ముగించాలని ఎందుకు భావిస్తున్నారు?'' అని మమత వాదించారు. వేధింపులతో బీఎల్ఓలు చనిపోతున్నారని మమత వాదించగా ఎలక్షన్ కమిషన్ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది కలగజేసుకుని '' ఉద్దేశపూర్వకంగా మమత సర్కార్ తక్కువ పనితనం ఉన్న 80 మంది గ్రేడ్-2 అధికారులను మాకు సహాయకులుగా అందించింది'' అని వాదించారు. దీనిపై మమత మాట్లాడారు.

'' ఈసీ నిబంధనల్లో పేర్కొన్న మేరకే తగు రాష్ట్ర ఆఫీసర్లను ఈసీ కోసం కేటాయించాం'' అని బదులిచ్చారు. మళ్లీ ద్వివేది మాట్లాడబోగా మమత చేతులు జోడించి ''జడ్జిగారు దయచేసి మమ్మల్ని పూర్తిగా మాట్లాడనివ్వండి'' అని వేడుకున్నారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ''మమత ఇంతదూరం వచ్చిందే మాట్లాడేందుకు. అయినా నిజమైన ఓటరు పేరు ఖచ్చితంగా ఓటర్లజాబితా తుది లిస్ట్‌లో ఉండాల్సిందే. తుది జాబితా నుంచి ఏ ఒక్క అమాయకుడిని పేరు తొలగింపునకు గురికావొద్దు'' అని అన్నారు. ఇంగ్లిష్ స్పెల్లింగ్‌లో తప్పులుంటే కూడా నోటీస్‌లు ఇస్తున్నారని శ్యామ్ దివాన్ వాదించగా కోర్టు ''ఇంగ్లిష్ అంటేనే స్పెల్లింగ్ తప్పులమయం'' అని ఒక బెంగాలీ సామెతను గుర్తుచేశారు. తెలుపురంగు చీర, నలుపు రంగు శాలువా ధరించి న్యాయవాదులు, పార్టీ ఎంపీ, సీనియర్ న్యాయవాది కల్యాణ్ బెనర్జీలతో వచ్చిన మమతను చూసేందుకు సుప్రీంకోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పలు కేసుల

# రేవంత్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు



సనాతన ధర్మాన్ని అగౌరవపరుస్తూ.. చంగిచర్లలో ముత్యాలమ్మ దేవాలయాన్ని అపవిత్రం చేశారని, హిందూ దేవతలను కించపరుస్తూ, దేవాలయాలపై దాడులు చేస్తున్నా ఈ ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. హిందూ పండగలపై ఆంక్షలు విధిస్తే ఊపేక్షించేదిలేదని హెచ్చరించారు. 'మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొస్తుండగా.. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తోంది. మహిళలకు రూ.2,500, రైతు భరోసా కింద రూ.15 వేలు, అంబేద్కర్ అభయహస్తం వంటి హామీలు ఏమయ్యాయి' అంటూ నిలదీశారు.

--ఆర్ఆర్ టాక్సు చెల్లిస్తేనే బిల్లులు..

గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మాదిరిగానే.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా కమీషన్లు, భూ మాఫియా నడుపుతోందని నితిన్ నబీన్ విమర్శించారు. పనులు జరగాలన్నా, బిల్లులు రావాలన్నా ఆర్ఆర్(రాహుల్, రేవంత్) టాక్సు చెల్లించాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. 'ఈ ప్రాంత ప్రజలపై మోదీకి మమకారం ఉంది. అందుకే బడ్జెట్‌లో రూ.వేల కోట్ల నిధులతో హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌పుణె మధ్య హైస్పీడ్ రైళ్లను కేటాయించారు. హైదరాబాద్‌నాగ్‌పుర్, హైదరాబాద్‌వరంగల్ పారిశ్రామిక కారిడార్లు, పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత ప్రధానిదే' అని తెలిపారు. తెలంగాణలో భాజపాకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతం, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు వచ్చాయని, ఈసారి ప్రతి బూత్ నుంచి 50 శాతం ఓట్ల సాధన లక్ష్యంతో పనిచేయాలని నితిన్ నబీన్ పార్టీ శ్రేణులకు సూచించారు. మహారాష్ట్ర, కేరళ, పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ప్రజలు భాజపాకే పట్టం కట్టారని, తెలంగాణ ప్రజలూ మోదీ నాయకత్వానికే మద్దతు ఇవ్వాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు.

---రాహుల్, కేసీఆర్‌ల మధ్య అంతర్గత ఒప్పందం

-సాగదీతలా ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలోని పెద్దలను అవినీతి, అక్రమాల కేసుల్లో జైలుకు పంపుతానన్నసీఎం..ఇప్పటివరకు చేసిందేమీ లేదు. కేసీఆర్, రాహుల్‌గాంధీ మధ్య అంతర్గత ఒప్పందాలు కుదిరాయి. 'నేను కొట్టినట్లు నటిస్తా.. నువ్వు ఏడ్చినట్లు నటించు' అన్నట్టు ఇరు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పౌరహక్కుల్ని కాలరాసింది. అప్పట్లో పోలీసులు..మీడియా, సినీ నటులు, ఎమ్మెల్యేలు, మంత్రులే కాకుండా సొంత పార్టీ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలుంటాయని బీరాలు పలికిన ప్రస్తుత ప్రభుత్వ పాలకులు విచారణను సీరియల్‌లా సాగదీస్తున్నారు. తాజాగా డీఎస్పీకి..సీఐగా డిమోషన్ ఇచ్చారు. ఇన్నాళ్లుగా చేసింది ఇదొక్కటే. భాజపా అధికారంలోకి వస్తే అవినీతిపై ఉక్కుపాదం మోపుతాం. భాజపా కొత్తగా ఏ కార్యక్రమం చేపట్టినా పాలమూరు నుంచి శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. గతంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఎడ్లబండ్ల యాత్ర, తెలంగాణ ఉద్యమ యాత్ర ఇక్కడి నుంచే ప్రారంభించాం. ఇప్పుడు భాజపా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ సిన్హా ఇక్కడి నుంచే పుర, కార్పొరేషన్ ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో డీకే అరుణను గెలిపించినట్లే పుర ఎన్నికల్లోనూ భాజపా అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. రూ.50 వేల కోట్లతో ప్రతిపాదించిన హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ పాలమూరు మీదుగానే వెళ్తోందని గుర్తుచేశారు.

--అణచివేయాలని చూస్తున్నారు: రామచందర్‌రావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

భాజపా మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించే సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సభలు నిర్వహించిన ప్రతిచోట భాజపా కార్యకర్తలను అరెస్టు చేసి అణచివేయాలని చూస్తున్నారు. వారి బెదిరింపులకు భయపడేది లేదు. గత ఎన్నికల్లో 'కారు.. సారు.. పదహారు' అన్న భారత రాష్ట్ర సమితి పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పి గద్దె దింపారు. అదే గతి కాంగ్రెస్‌కూ పడుతుంది. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమిచ్చారని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర బడ్జెట్‌లో పాలమూరు, నల్గొండ జిల్లాలకు ఏమిచ్చారో సమాధానం చెప్పాలి' అని నిలదీశారు. సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పుర ఎన్నికల ఇన్‌ఛార్జి ఆశిష్ షెలార్, నేతలు గౌతంరావు, చింతల రామచంద్రారెడ్డి, టి.ఆచారి, బి.శాంతికుమార్, జాఫర్, జి.పద్మజారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, నాగురావు నామాజీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి
## మండిపడ్డ బండి సంజయ్



ఎందుకు ఓటు వేయాలో అని అడగండి'' అని సంజయ్ పేర్కొన్నారు. తమకు భయపడి కెటిఆర్ సిరిసిల్లలోనే అడ్డాపెట్టి ఓటుకు రూ.10 వేలు ఇస్తున్నారని ఆరోపించారు. ''కెటిఆర్.. నా జోలికొస్తే రోడ్డుకీడుస్తా. కేంద్రం నిధులిస్తే.. ఆ నిధులను తినేసి సిరిసిల్లను వరదల్లో ముంచుతున్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లకు నయా పైసా ఇవ్వలేదు. కాంగ్రెస్ వద్దనే పైసలు లేవు. వాళ్లకి ఎందుకు ఓటేయాలి? అందుకే ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోతున్నారు. మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత హామీలతో మీ ముందుకు వస్తున్నారు. కాంగ్రెస్ దొంగ హామీలను నమ్మి మోసపోతే ఐదేళ్ల అరిగోస తప్పదు'' అని సంజయ్ అన్నారు.

# అణ్వాయుధాలు..
## 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

--నాటి ఒప్పందం..

అణ్వాయుధ నిల్వలకు సంబంధించి 1972లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, సోవియట్ నేత బ్రెజ్నెవ్‌ల మధ్య తొలిసారి ఒప్పందం జరిగింది. అయితే, 2001లో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ సమయంలో అమెరికా బయటకు వచ్చింది. మళ్లీ 2010లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్‌ల మధ్య 'న్యూ స్టార్ట్' పేరుతో ఒప్పందం (New START Treaty) కుదిరింది. దీని ప్రకారం.. ఇరుదేశాలూ 700 కన్నా ఎక్కువ క్షిపణులు, యుద్ధవిమానాలపై 1550 కన్నా ఎక్కువ అణ్వస్త్రాలను వినియోగానికి సిద్ధంగా ఉంచకూడదు. ఒకరి అణు కేంద్రాలను మరొకరు తనిఖీ చేసుకోవచ్చు. అయితే, ఇది 2021లోనే ముగియాల్సి ఉన్నప్పటికీ.. ఐదేళ్లపాటు పొడిగించారు.

--విఫలమైతే విస్తరణే..!

తాజాగా అది ఫిబ్రవరి 5తో ముగియనుంది. 35 ఏళ్లలో తొలిసారి ఇలాంటి పరిస్థితి రావడంతో అణ్వాయుధాల సంఖ్యను పెంచుకునే అవకాశం లభిస్తుందనే ఆందోళన మొదలైంది. ఈ పరిస్థితి రష్యా, అమెరికా మధ్య అణ్వాయుధ పోటీకి దారితీయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరత, 'అణు' ఘర్షణల ముప్పును పెంచుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం కొనసాగింపుపై ఇరుపక్షాలు అంగీకరించడంలో విఫలమైతే.. అణ్వాయుధ విస్తరణ భారీగా పెరిగే అవకాశం ఉందని అమెరికాలోని ఆయుధ నియంత్రణ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డారిల్ కింబాల్ పేర్కొన్నారు. అమెరికా అణు నిల్వలపై పరిమితులు లేకుంటే ప్రమాదకరమైన ప్రపంచమే అవుతుందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఇటీవల హెచ్చరించారు. తమ జాతీయ ప్రయోజనాలను రక్షించుకునేందుకు అన్ని మార్గాలను (అణ్వాయుధాలను ఉద్దేశిస్తూ) ఉపయోగించడానికి రష్యా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌పై దండయాత్ర మొదలుపెట్టినప్పటి నుంచి చెబుతున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఓ ఆర్డర్‌పై 2024లో ఆయన సంతకం కూడా చేశారు. అయితే, న్యూస్టార్ట్ ఒప్పందం పరిమితులపై ఇరుపక్షాలు చర్చించేందుకు అనుగుణంగా దీనిని మరో ఏడాది పొడిగించేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ ప్రకటించిప్పటికీ అమెరికా నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.



# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఘనవిజయం ఖాయం

## కొమిరిశెట్టి సాయిబాబా



శంకర్ పల్లి 2,3వ వార్డుల ఇంచార్జిగా సాయిబాబా



శేరిలింగంపల్లి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం

–శంకర్ పల్లి 2,3వ వార్డుల ఇంచార్జిగా సాయిబాబా

– శేరిలింగంపల్లి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగను న్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశె ట్టి సాయిబాబా తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో శంకర్ పల్లి ము న్సిపాలిటీ పరిధిలోని 2,3వ వార్డులకు కొమిరిశెట్టి సాయిబాబాను ఇం చార్జిగా నియమించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బుధవారం సాయిబాబా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంకర్ పల్లి 3వ వార్డు అభ్యర్థి సుద్దగోని స్వర్ణలత శ్రీనివాస్ కు మద్దతుగా స్థానిక నాయకులు, శేరిలింగంపల్లి నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా రు. 2వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి బిసోళ్ల సంధ్యారాణి శ్రీధర్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2, 3వ వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అబద్ధపు హామీలతో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగిన టిఆ ర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ నేతృ త్వంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మరోసారి కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగం జంగయ్య యాదవ్, రాజు ముదిరాజ్, శామ్లెట్ శ్రీ నివాస్, నరేష్ సింగ్, దారుగుపల్లి పరమేష్, నరేష్ లతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కు ఘనస్వాగతం పలికిన శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు

**నితిన్ నబిన్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన నితిన్ నబిన్ కు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్ర యంలో ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి రవికుమార్ యాదవ్, సీనియర్ నాయకులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జాతీయ అధ్యక్షుడి పర్యటన ఎంతో కీలకమని పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిల నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అధి కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ పటిష్టతకు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శే రిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి తదితరులు

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

ప్రపంచ కాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి లోని ఆర్బీఆర్ కాంప్లెక్స్ 4వ బ్లాకులో మహిళలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిటిజన్ హాస్పిటల్ , అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ కు చెందిన రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మల్లిక్ సింగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డబ్ల్యూహెచ్ఓ, వరల్డ్ క్యాన్సర్ ఫెడరేషన్ లు ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కొరకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని, అందులో భాగంగా ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన శరీరంలోని కణాలు నియంత్రణ లేకుండా పెరిగిపోవడమే క్యాన్సర్ వ్యాధి అని అన్నారు ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధి బారిన పడి లక్షలా ది మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఆర్థిక నష్టం కూడా జరుగుతుంటాయని, ఈ వ్యాధి కేవలం ఒకరి జీవితానికే కాదు, ఒక కుటుంబానికే కాదు, మొత్తం సమాజాన్నే ప్రభావితం చేస్తు న్న వ్యాధి. క్యాన్సర్ ను ముందస్తుగానే గుర్తిస్తే పూర్తిగా నయమ య్యే అవకాశం ఉంటుందన్నారు. క్యాన్సరులో సుమారు 144 రకాలు ఉన్నాయని, తల వెంట్రుక దగ్గర నుండి కాలి గోరు వరకు ఏ భాగానికైనా ఈ వ్యాధి రావచ్చన్నారు. మగవారిలో ఓరల్ క్యాన్సర్, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, కొలొరెక్టివ్, కడుపు, లివర్ మొదలైన భాగాలలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుందని, మహిళల్లో బ్రస్ట్ క్యాన్సర్(మొమొగ్రఫి), గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (పాప్సిమియర్), ఊపిరితిత్తులు, థైరాయిడ్, కొలొరె క్టివ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. కారణం లేకుండా బరువు తగ్గడం, గాయాలు ఎక్కువ రోజులుగా మానకపోవడం, శరీరంలో గడ్డలు, కణితులు ఏర్పడటం, నిరంతరం దగ్గు మరియు గొంతు నొప్పి, మల, మూత్ర విస ర్జనలో మార్పులు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ ను కలవాలని సూచించారు. క్యాన్సర్ వ్యాది రావడానికి పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం, అధికంగా మద్యం సేవించడం, జంక్ ఫుడ్ తినడం, అధిక బరువు, కనీస శారీరక శ్రమ వంటి వ్యాయామం లేకపోవడం, మహిళలు చంటి పిల్లల కు చనుబాలు యివ్వకపోవడం, వంశపారంపర్యంగా రావడం కారణలన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ధైర్యం చెప్పి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని, మొదటిదశలోనే వ్యాధి గుర్తించి చికిత్స తీసుకొని, ఆరోగ్యంగా జీవిస్తున్నవారు వేలసంఖ్యలో ఉన్నార న్నారు. ఈ వ్యాధి బారిన పడినవారు భయపడకుండా పూర్తి అవ గాహనతో ధైర్యంగా ఎదుర్కోవాలని, ముందస్తు జాగ్రత్తే ఉత్తమ రక్షణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్ మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, మున్నాభాయ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కస్తూరి, రఘునాధరావు, విష్ణు ప్రసాద్, శివరామ రెడ్డి, హాస్పిటల్ ప్రతినిధులు శ్రీశైలం, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ మల్లిక్ సింగరాజు

# సముద్రంలో బాలుడి సాహసం .. గంటలపాటు ఈది.. కుటుంబాన్ని కాపాడి!

ఈ కబురు, నెట్ వర్క్ ; సముద్రంలో కొట్టుకుపోయిన తన తల్లి, తోబుట్టువులను కాపాడుకునేందుకు ఓ బాలుడు పెద్ద సాహసం చేశాడు. అల్లకల్లోలంగా మారిన సముద్రంలో దాదాపు 4 గంటలపాటు భీకర అలలకు ఎదురీది ఎట్టకేలకు తీరానికి చేరుకుని సమాచారం అందించాడు. అప్పటికే చీకటి పడటంతో హెలికాప్టర్ సాయంతో రంగంలోకి దిగిన అధికారులు.. తల్లి, మరో ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. ఆస్ట్రేలియా లో ఈ ఘటన వెలుగుచూసింది. పెర్త్‌కు చెందిన జోవాన్ అపెల్బీ అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి చిన్న పడవలు (కయాక్), పెడల్ బోర్డ్‌ల సాయంతో సముద్రంలో విహారానికి వెళ్లారు. అంతలోనే వాతావరణం మారిపోవడంతో.. వారు క్రమక్రమంగా తీరానికి దూరంగా కొట్టుకుపోయారు. ఈ క్రమంలోనే.. తల్లి సూచనతో పెద్ద కుమారుడు ఆస్టిన్ (13) సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. ఎవరినైనా సాయం కోరేందుకు తొలుత కయాక్‌పై తీరం వైపు బయల్దేరాడు. కానీ, అందులోకి నీరు చేరడంతో మధ్యలోనే వదిలేశాడు. అనంతరం లైఫ్‌జాకెట్‌నూ వదిలేసి.. తీరం వైపు ఈత కొట్టడం ప్రారంభించాడు. ఉద్ధృత అలల నడుమ దాదాపు 4 కిలోమీటర్ల మేర ఈదుకొని తీరానికి చేరుకున్నాడు.

బాలుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు హెలికాప్టర్ సాయంతో గాలింపు చేపట్టి.. తల్లి, ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఆ సమయానికి వారు తీరానికి 14 కిలోమీటర్ల దూరంలో పెడల్ బోర్డులను పట్టుకుని వేలాడుతూ కనిపించారని చెప్పారు. బాలుడి ధైర్యసాహసాలను ప్రశంసించారు. నలుగురికీ వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరికీ ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం రాలేదన్నారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలను వదిలేసి తాను వెళ్లలేని పరిస్థితి ఉందని, ఆస్టిన్‌ను పంపడం తన జీవితంలో తీసుకున్న అత్యంత కష్టమైన నిర్ణయమని తల్లి జోవాన్ తెలిపారు. సముద్రంలో కొట్టుకుపోయిన మొదట్లో ధైర్యంగానే ఉన్నామని, కానీ.. చీకటి పడేకొద్దీ అలలు ఉద్ధృతంగా మారాయని, చలికి వణికిపోయామని చెప్పారు.



# రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా తెలంగాణ కోసం పోరాడారా?: హరీశ్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ కోసం తాము మంత్రి పదవులు త్యాగం చేశామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా రాష్ట్రం కోసం పోరాడారా? అని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మెదక్ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. ''మెదక్ నుంచి సిద్దిపేటకు ఆఫీసులను నేను తరలించానని అంటున్నారు. నేను తరలించిన ఆఫీస్ పేరు చెబితే నేనే తెచ్చిస్తా. రేవంత్‌రెడ్డి ఒక్కటంటే.. నేను రెండంటాను. ఆయన మంచి మాట్లాడితే.. మేము మంచే మాట్లాడతాం. ఆయన భాష జారితే.. మేము కూడా జారాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఈనెల 11లోపు ఇవ్వకపోతే కర్షక ఆగ్రహానికి గురికాక తప్పదు'' అని హరీశ్‌రావు అన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్.. కొట్టివేసిన స్పీకర్



--నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే: సంజయ్

స్పీకర్ తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని స్పష్టం చేశారు. ''నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చాను'' అని సంజయ్ తెలిపారు.

--అది హాస్యాస్పదం: కేపీ వివేకానంద గౌడ్

కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. ''కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు'' అని వివేకానంద తెలిపారు.

# నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు ..మహిళా జర్నలిస్ట్‌తో ట్రంప్



ఈ కబురు; అమెరికా అధ్యక్ష భవనంలోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన ఓ రిపోర్టర్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో కొత్తగా విడుదలైన పత్రాల గురించి సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన కైట్లాన్ కొల్లిన్స్ అనే రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన అమెరికా అధ్యక్షుడు 'నువ్వో చెత్త రిపోర్టర్‌వి' అంటూ ఆమెను విమర్శించారు. ''నేను పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటివరకు ఒక్కసారి కూడా నవ్వినట్లు చూడలేదు. మీలాంటి వాళ్ల వల్లే సీఎన్ఎన్ ఛానల్ రేటింగ్ పడిపోతుంది. మీరు ఎప్పుడూ నిజాలు చెప్పరని మీకు బాగా తెలుసు. అందుకే ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో నాతో సహా ఇతరుల పేర్లను కుట్ర పూరితంగా విడుదల చేశారు. ఇప్పుడు ఇటువంటి విషయాల గురించి కాకుండా దేశం గురించి ఆలోచిస్తే అందరికీ మంచిది'' అని ట్రంప్ రిపోర్టర్‌ని ఉద్దేశించి అన్నారు. ఈ మీడియా సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి అమెరికా న్యాయశాఖ ఇటీవల మరిన్ని పత్రాలను విడుదల చేసింది. అందులో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ, బిల్ గేట్స్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్‌ల ప్రస్తావన, వారికి సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. అయితే, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించిన ఫొటోలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీనిపైనే తాజాగా జరిగిన విలేకరుల

# నీట్ పీజీ కటాఫ్ తగ్గింపుపై కేంద్రానికి సుప్రీం నోటీసు


దిల్లీ: నీట్ పీజీ (202526) పరీక్షలో ఉత్తీర్ణతకు అర్హత మార్కులను (క్వాలిఫైయింగ్ కటాఫ్ పర్సంటైల్) జాతీయ వైద్య శాస్త్రాల పరీక్ష బోర్డు (ఎన్‌బీఈఎంఎస్) గణనీయంగా తగ్గించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పందన కోరుతూ కేంద్ర ప్రభుత్వం, సంబంధిత పక్షాలకు సుప్రీంకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. కటాఫ్ పర్సంటైల్‌ను తగ్గించడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు భంగకరమనీ, దీర్ఘకాలం శ్రమించి పరీక్షలో ఉత్తీర్ణులైన ప్రతిభావంతుల పాలిట అన్యాయమని పిటిషన్‌దారులు పేర్కొన్నారు. పిటిషన్‌పై విచారణను సుప్రీం శుక్రవారానికి వాయిదా వేసింది. దేశంలో 18 వేలకు పైగా పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడం కోసమని బోర్డు రిజర్వుడు అభ్యర్థులకు క్వాలిఫైయింగ్ కటాఫ్ పర్సంటైల్‌ను 40 నుంచి సున్నాకు తగ్గించింది. జనరల్ కేటగిరీకి 50వ పర్సంటైల్ నుంచి 7కు తగ్గించింది. వైద్య విద్య అంటే వ్యాపారం కాదనీ, సీట్ల భర్తీ కోసం నాణ్యతా ప్రమాణాలకు నీళ్లు వదలకూడదని పిటిషనర్లు వాదించారు.

## త్వరలో బ్లేడ్ బ్యాటరీ బస్సులు
### –ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడి



అత్యాధునిక బ్లేడ్ బ్యాటరీ సాంకేతికతతో కూడిన విద్యుత్ బస్సుల ఉత్పత్తిని వచ్చే త్రైమాసికంలో ప్రారంభిస్తామని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాబు సుబ్రమణియన్ తెలిపారు. దేశీయ విద్యుత్ వాహన రంగంలోనే తొలిసారిగా, ఒలెక్ట్రా అభివృద్ధి చేసిన బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కు అధికారిక ధ్రువీకరణ లభించడం తమకు దక్కిన విజయంగా పేర్కొన్నారు. 'బ్యాటరీల్లోని మాడ్యూల్స్ స్థానంలో సన్నగా, పొడవుగా ఉండే లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) సెల్స్‌ను బ్లేడ్స్ మాదిరి అమర్చడమే' బ్లేడ్‌బ్యాటరీ టెక్నాలజీ ప్రత్యేకత. ఇందువల్ల బ్యాటరీ పరిమాణం సగానికి తగ్గుతుంది. వీటి జీవితకాలం పెరగడమే కాక, ఒక ఛార్జింగ్‌పై ప్రయాణించే దూరం కూడా అధికమవుతుంది. 202526 మూడో త్రైమాసికంలో 385 విద్యుత్ వాహనాలను డెలివరీ చేశామని, ఇందులో 24 టిప్పర్లున్నాయని మహేష్ తెలిపారు. ఇప్పటి వరకు తమ సంస్థ ఉత్పత్తి చేసిన 3,639 విద్యుత్తు బస్సులు ట్రక్కులు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, సంస్థ చేతిలో 9,439 విద్యుత్ వాహనాలకు ఆర్డర్లు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్ వద్ద 150 ఎకరాల్లో నిర్వహిస్తున్న కొత్త ప్లాంటు ద్వారా వాహనాల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 10,000కు పెంచుకునే వీలుందన్నారు.

## ఎన్ఎస్ఈ రూ.23,000 కోట్ల ఐపీఓ!




మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి రావడంతో, ఐపీఓ ప్రక్రియను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రారంభించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐపీఓ గురించి చర్చించేందుకు శుక్రవారం ఎన్ఎస్ఈ బోర్డు సమావేశం కానుంది. త్వరలో ఐపీఓ కమిటీని ఎన్ఎస్ఈ బోర్డు ఏర్పాటు చేయనుంది. నమోదు ప్రక్రియ, మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్ల నియామకాలను ఈ కమిటీ నిర్ణయించనుంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల ఆధారంగా, మార్చి చివరకు ముసాయిదా పత్రాలను ఎన్ఎస్ఈ దాఖలు చేసే అవకాశం ఉంది. ఐపీఓలో భాగంగా కంపెనీలో 4.5% వాటాకు సమానమైన షేర్లను రూ.23,000 కోట్లకు విక్రయించాలని ఈ ఎక్స్ఛేంజీ భావిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) సొల్యూషన్స్ అందించే సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ పరిమాణాన్ని ముందుగా అనుకున్న రూ.4,900 కోట్ల నుంచి రూ.2,834 కోట్లకు తగ్గిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. యాంకర్ మదుపర్లు ఈ నెల 6న తమ బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. ఇష్యూలో భాగంగా రూ.1,023.5 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.1,810.4 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఐపీఓ ధరల శ్రేణిని బుధవారం ప్రకటించే అవకాశం ఉంది. వాహన విడిభాగాల తయారీదారు ధూత్ ట్రాన్స్‌మిషన్, ఐపీఓ ద్వారా 250 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.2,258 కోట్లు) సమీకరించేందుకు కాన్ఫిడెన్షియల్ ప్రీఫైలింగ్ మార్గంలో సెబీ వద్ద దరఖాస్తు చేసుకుంది. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్‌లో 14.3% వాటా కోసం రూ.2,750 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. లావాదేవీ తర్వాత ఆదిత్య బిర్లా హౌసింగ్‌లో ఆదిత్య బిర్లా క్యాపిటల్ వాటా 85.7 శాతానికి తగ్గనుంది. అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కపూర్ పదవీ విరమణ చేశారు. జనవరి 31 నుంచి అమల్లోకి వచ్చిందని కంపెనీ తెలిపింది.

## ఐటీ షేర్లను భయపెట్టిన ఆంథ్రోపిక్.. ఏంటీ ఏఐ టూల్..?




కృత్రిమ మేధ నైపుణ్యాలపై దిగ్గజ టెక్ కంపెనీలు దృష్టిపెట్టిన వేళ.. 'ఆంత్రోపిక్' సంస్థ కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చి సంచలనం సృష్టించింది. ఈ ప్రకటనతో అమెరికా టెక్ కంపెనీలేగాక.. భారత ఐటీ రంగ షేర్లు కుప్పకూలాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రధాన కంపెనీలు దాదాపు 7 శాతం వరకు కుంగిపోయాయంటే.. 'ఆంత్రోపిక్' ఎలాంటి అలజడి సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఏంటీ ఏఐ టూల్ ..? ఎలా పనిచేస్తుంది.

**––సహోద్యోగిగా.. 'క్లాడ్ కోవర్క్'.....** 'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంత్రోపిక్.. ఇటీవల 'క్లాడ్ కోవర్క్ ఏజెంట్'కు 11 ఓపెన్ సోర్స్ ప్లగ్‌ఇన్‌లను విడుదల చేసింది. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగ్‌ఇన్‌లు ఉపయోగపడనున్నాయి. ఫైనాన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, బయాలజీ రీసెర్చ్, కస్టమర్ సపోర్ట్ వంటి రంగాల్లోనూ ఈ టూల్ కీలకంగా పనిచేస్తుందని కంపెనీ ప్రకటనలో వెల్లడించింది. ఈ కొత్త అప్‌డేట్లతో ఇకపై 'క్లాడ్ కోవర్క్' అనేది కేవలం చాట్‌బాట్ మాత్రమే గాక.. ఓ టీమ్‌మేట్‌లా పనిచేయనుంది. మన కంప్యూటర్‌పై వర్క్ కూడా చేయగలదు. ఈ ఏజెంట్ ఫైల్స్‌ను రీడ్ చేయగలదు. డాక్యుమెంట్లను ఎడిట్ చేయడం, కొత్త ఫైల్స్ క్రియేట్ చేసి, రీనేమ్ చేయడం, ఫోల్డర్లను ఆర్గనైజ్ చేయడం, నోట్స్‌ను రిపోర్టులుగా మార్చడం వంటివి చేస్తుంది. రచయితలు, అనలిస్టులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ఆఫీసు యూజర్లు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఇక, లాయర్లు, కంపెనీల కోసం ప్రత్యేక టూల్స్ కూడా ఉన్నాయని ఆంత్రోపిక్ తెలిపింది.

**––ఐటీ కంపెనీలపై ప్రభావం ఏంటీ..?**.....సాధారణంగా డాక్యుమెంట్ రివ్యూలు, డేటా అనాలిసిస్ వంటి పనులను మల్టీనేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఇప్పుడు ఆంత్రోపిక్ ఏఐ టూల్‌తో ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరిగే అవకాశం ఉండటం భారత ఐటీ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ మైండ్ ట్రీ, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్ వంటి కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. ఈ పరిస్థితిని అనలిస్టులు 'సాస్పోకాలిప్స్ 'గా అభివర్ణిస్తున్నారు. అంటే ' కంపెనీలకు ఏఐ సాయం చేస్తుంది' అనే భావన నుంచి 'కంపెనీలను ఏఐ భర్తీ చేయగలదు' అనే స్థాయికి ఆందోళనలు పెరగడమే ఈ సాస్పోకాలిప్స్. ఇలాంటి ఏఐ టూల్స్‌తో సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీస్ కంపెనీల మధ్య పోటీతత్వ విధానాలు మారిపోతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐటీ కంపెనీల్లో ఉండే డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి టాస్క్‌లను ఈ టూల్ భర్తీ చేయడంతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## హెచ్1బీ ఫీజులకు చెక్.. భారత్‌లో గూగుల్ భారీ క్యాంపస్




హెచ్1బీ వీసాల జారీకి అమెరికా తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో టెక్ కంపెనీలకు విదేశీ ఉద్యోగుల నియామకాలు భారంగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిగ్గజ సంస్థ గూగుల్ కీలక చర్యలు చేపట్టింది. వీసాలు, ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడకుండా భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులోభాగంగానే బెంగళూరులో భారీ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ కథనం వెల్లడించింది. బెంగళూరులోని టెక్ కారిడార్లలో ఒకటైన వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో 20వేల మంది ఉద్యోగుల కోసం గూగుల్ భారీ క్యాంపస్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ఓ ఆఫీసు టవర్‌ను గూగుల్ మాతృక సంస్థ ఆల్ఫాబెట్ లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్ల కోసం చర్చలు సాగిస్తున్నట్లు తెలిపింది. ఈ మూడు టవర్లు 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి టవర్‌లో మరికొన్ని నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆ కథనం తెలిపింది. మిగతా రెండు టవర్ల నిర్మాణం వచ్చే ఏడాది నాటికి పూర్తికానుందట. మొదటి భవనం లీజును ఆల్ఫాబెట్ అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం భారత్‌లో గూగుల్‌కు 14వేల మంది ఉద్యోగులున్నారు. వైట్‌ఫీల్డ్ క్యాంపస్ పూర్తిగా మొదలైతే.. అమెరికా వెలుపల గూగుల్ కార్యకలాపాలకు భారత్ కేంద్రంగా మారనుంది.

**––ఏఐ రేసుతో భారత్‌పై దృష్టి....** ఇప్పుడు టెక్ కంపెనీలు ఏఐపై దృష్టిపెట్టాయి. ఇలాంటి తరుణంలో మార్కెట్ సృష్టి, అధునాతన ఇంజినీరింగ్ కార్యకలాపాలకు భారత్ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోంది. దీంతో దిగ్గజ కంపెనీలు మన దేశంపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటికే ఏఐ సంస్థ ఆంత్రోపిక్ భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. గూగుల్ వంటి సంస్థలు కూడా ఆ దిశగా దృష్టిపెట్టాయి. మరోవైపు, హెచ్1బీ (H 1B Visa) వీసాలపై ట్రంప్ సర్కారు నిబంధనలు కంపెనీల విస్తరణకు కారణమవుతున్నాయి. హెచ్1బీ వీసా దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ట్రంప్ సర్కారు నూతన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీలు తమ దీర్ఘకాల నియామక ప్రణాళికలపై పునరాలోచన చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అమెరికాకు భారత ఉద్యోగులను తీసుకోవడం కంటే.. భారత్‌లోనే కార్యకలాపాలను సాగించడం ఉత్తమమని పలు కంపెనీలు భావిస్తున్నాయి. దీనివల్ల వీసా ఆలస్యాలు, ఖర్చులను తప్పించుకోవనేది టెక్ సంస్థల ఆలోచనగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గూగుల్ కొత్త క్యాంపస్ ప్రణాళికలు చేపట్టినట్లు సమాచారం.

# 'బు'ల్లెట్‌లా అమెరికా డీ'ల్'

**–రూ.12.10 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద**
**–ఎఫ్ఐఐ కొనుగోళ్లు రూ.5,236 కోట్లు**
**–డీఐఐ కొనుగోళ్లు రూ.1,014 కోట్లు**




అనుకోని ఆనందం.. ఊహించని సంబరం. బుల్ రంకేసింది. అలా ఇలా కాదు. ఒక్కరోజే ఏకంగా 2000 పాయింట్లకు పైగా దూసుకెళ్లింది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రకటన నేపథ్యంలో, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో దాదాపు అన్ని రంగాల షేర్లు కళకళలాడాయి. బ్యారెల్ ముడిచమురు ధర 1.5% పెరిగి 67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. రూపాయి జోరు: వాణిజ్య ఒప్పందం కుదరడంతో, మళ్లీ విదేశీ మదుపర్లు మన మార్కెట్లలో కొనుగోళ్లకు దిగారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి రాణించేందుకు ఇదీ ఒక కారణమైంది. ఆసియాలో ఎక్కువ రాణించిన కరెన్సీగా రూపాయి నిలిచింది. డాలర్‌తో పోలిస్తే 117 పైసలు పెరిగి 90.32 వద్ద ముగిసింది. గత రెండున్నర వారాల్లో రూపాయికిదే గరిష్ఠ స్థాయి. చమురు ధరలు తగ్గడమూ కలిసొచ్చింది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులో రూ.12.10 లక్షల కోట్లు పెరిగి రూ.467.14 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

**––8 నెలల్లోనే అతిపెద్ద లాభం....** సెన్సెక్స్ ఉదయం 3656 పాయింట్ల (క్రితం ముగింపు 81,666.46) లాభంతో 85,323.20 పాయింట్ల వద్ద దూకుడుగా ప్రారంభమైంది. అదే జోరులో 4,205.27 పాయింట్లు పెరిగి 85,871.73 వద్ద ఇంట్రాడేలో గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2,072.67 పాయింట్లు పెరిగి 83,739.13 వద్ద ముగిసింది. గత 8 నెలల్లో సూచీకిదే ఒకరోజు అతిపెద్ద లాభం. నిఫ్టీ 639.15 పాయింట్లు రాణించి 25,727.55 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,341.20 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

**–28 షేర్లకు లాభాలు.....:** సెన్సెక్స్ 30 షేర్లలో 28 పరుగులు తీశాయి. అదానీ పోర్ట్స్ 9.12%, బజాజ్ ఫైనాన్స్ 6.68%, ఇండిగో 5.51%, పవర్‌గ్రిడ్ 4.85%, సన్‌ఫార్మా 4.54%, బజాజ్ ఫిన్‌సర్వ్ 4.29%, ఎస్‌బీఐ 3.48%, రిలయన్స్ 3.43%, ఎల్ అండ్ టీ 2.95%, యాక్సిస్ బ్యాంక్ 2.86%, టైటన్ 2.80%, ట్రెంట్ 2.78% లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, బీఈఎల్ స్వల్పంగా నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. సేవలు 4.86%, స్థిరాస్తి 4.79%, విద్యుత్ 4.79%, యుటిలిటీస్ 3.92%, యంత్ర పరికరాలు 3.71%, పరిశ్రమలు 3.44%, వినియోగ 3.06%, లోహ 2.85%, ఆరోగ్య సంరక్షణ 2.83%, ఆర్థిక సేవలు 2.83% రాణించాయి. బీఎస్ఈలో 3279 షేర్లు లాభపడగా, 1015 స్క్రిప్‌లు నష్టపోయాయి. 142 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

**––వాణిజ్య ఒప్పందం ప్రభావిత షేర్లు ఇలా....** జౌళి షేర్లలో గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ 20%, వెల్‌స్పన్ లివింగ్ 19.85%, గర్వారే టెక్నికల్ ఫైబర్స్ 17.07%, కేపీఆర్ మిల్స్ 15.31%, ఎస్‌పీ అపరెల్స్ 14.19%, ట్రైడెంట్ 11.27%, అరవింద్ 10.23%, పేజ్ ఇండస్ట్రీస్ 3.79%, రేమండ్ లైఫ్‌స్టైల్ 3.39% మెరిశాయి. తోళ్లు, పాదరక్షల షేర్లు చూస్తే.. భారతీయ ఇంటర్నేషనల్ 6.37%, మయూర్ యునికోటర్స్ 7.73%, మెట్రో బ్రాండ్స్ 0.41%, బాటా ఇండియా 0.23% పెరిగాయి. సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే అవంతీ ఫీడ్స్, అపెక్స్ ఫ్రోజెన్ 20% దూసుకెళ్లి వరుసగా రూ.960.60, రూ.351.10 దగ్గర స్థిరపడ్డాయి. జీల్ అక్వా 10.58%, కింగ్స్ ఇన్‌ఫ్రా 7.62%, ముక్కా ప్రోటీన్స్ 5.01%, కోస్టల్ కార్పొరేషన్ 5% లాభపడ్డాయి.

స్పెషాలిటీ రసాయనాల షేర్లలో ఆర్తి ఇండస్ట్రీస్ 15.10%, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ 6.82%, నవీన్ ఫ్లోరిన్ 6.22%, నియోజెన్ కెమికల్స్ 6.19%, అతుల్ 5.25%, వినతీ ఆర్గానిక్స్ 4.67%, ఎస్ఆర్ఎఫ్ 3.76% రాణించాయి. రత్నాభరణాల షేర్లలో గోల్డియం ఇంటర్నేషనల్ 20%, వైభవ్ గ్లోబల్ 9.13%, కల్యాణ్ జువెలర్స్ 4.91%, శ్రీంగార్ హౌస్ 4.51%, టైటన్ 2.80%, పీఎన్ గాడ్గిల్ 1.52%, పీసీ జువెలర్ 0.29% మెరిశాయి. వాహన విడిభాగాల షేర్లలో బెల్‌రైజ్ 7.37%, భారత్ ఫోర్జ్ 6.56%, సంవర్ధన మదర్‌సన్ 6.33%, సోనా బీఎల్‌డబ్ల్యూ 6.13%, సుందరం ఫాజనర్స్ 4.01%, బాష్ 3.10%, యునోమిండా 2.86% కళకళలాడాయి. అదరగొట్టిన అదానీ షేర్లు: అదానీ గ్రూప్ షేర్లు మంగళవారం అదరగొట్టాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 10.61%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 10.38%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10.23%, అదానీ పోర్ట్స్ 9.12%, అదానీ పవర్ 6.76%, అదానీ టోటల్ గ్యాస్ 4.52%, సంఘీ ఇండస్ట్రీస్ 3.60%, అంబుజా సిమెంట్స్ 3.45%, ఎన్‌డీటీవీ 2.91%, ఏసీసీ 2.08% చొప్పున లాభాలు నమోదుచేశాయి. అదానీ గ్రూప్ నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.13.78 లక్షల కోట్లుగా నమోదైంది.

## ఒక్కరోజే రూ.14వేలు పెరిగిన వెండి..
## రూ.1.60లక్షలు దాటిన బంగారం



దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, పెళ్లిళ్ల సీజన్‌కు ముందు గిరాకీ నేపథ్యంలో ఈ లోహాల ధరలు మరోసారి కొండెక్కుతున్నాయి. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.14వేలు పెరగ్గా.. బంగారం ధర రూ.1.60లక్షలు దాటి పయనిస్తోంది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం 11.30 గంటల సమయంలో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,400 పలికింది. మంగళవారం ఈ ధర రూ.1,58,500గా ఉండగా.. ఒక్కరోజే దాదాపు రూ.6వేలు పెరగడం గమనార్హం. ఇక, క్రితం ముగింపు సమయానికి రూ.2,79,600 వద్ద ఉన్న కిలో వెండి ధర నేడు రూ.2,93,900కు చేరుకుంది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు పెరుగుతున్నాయి. స్పాట్ ట్రేడింగ్‌లో ఔన్సు పుత్తడి ధర 5,080 డాలర్లు, ఔన్సు వెండి ధర 87.95 డాలర్లుగా కొనసాగుతోంది. ఇటీవల బంగారం, వెండి ధరల్లో భారీ దిద్దుబాటు నేపథ్యంలో ఈ లోహాలు అందుబాటులోకి వచ్చాయని భావించి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీనికితోడు అమెరికాఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో మళ్లీ వీటిని సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తున్నారని మార్కెట్ అనలిస్టులు పేర్కొంటున్నారు.

## రాబోయే 2025 ఏళ్లు భారత్ శకం: అంబానీతో చర్చలో లారీ ఫింక్



రాబోయే రెండు దశాబ్దాలు భారత్ శకమేనని బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్ అభివర్ణించారు. ముంబయిలో జియోబ్లాక్‌రాక్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత వృద్ధి ప్రయాణం ప్రజలు పెట్టుబడులు పెట్టేందుకు, భాగస్వాములయ్యేందుకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. 'ఇన్వెస్టింగ్ ఫర్ ఎ న్యూ ఎరా' అనే అంశంపై రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా తానుకూడా భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు లారీ ఫింక్ వెల్లడించారు. ''భారతదేశ వృద్ధి గురించి ఆలోచిస్తే.. ఒక రోజు.. వారమో, త్రైమాసికమో, సంవత్సరమో కాదు.. ఓ సుదీర్ఘ కాలం. బహుశా ఇది భారతదేశానికి చెందిన శకం. రాబోయే రెండున్నర దశాబ్దాల కాలం భారత్‌దేనని చెప్పొచ్చు.
విదేశీ మూలధన అవసరం భారత్‌కు తక్కువగానే ఉంది'' అని లారీ ఫింక్ అన్నారు. మోదీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తూ.. కరెన్సీ డిజిటలీకరణతో దేశంలో వాణిజ్యం రూపాంతరం చెందిందన్నారు. దీర్ఘకాలంలో పెట్టుబడుల ప్రాముఖ్యత గురించి ప్రజలను ఆలోచింపజేయాలని, దేశంలోని గొప్ప కంపెనీల్లో భాగస్వాములై, వాటితో కలిసి ఎదిగేలా ప్రోత్సహించాలని అన్నారు.

## మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి ..ముకేశ్ అంబానీ



ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థిక వృద్ధిలో మరింత ముందుకు వెళ్తోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ అన్నారు. గత 20 ఏళ్లుగా దేశంలో శాంతి భద్రతలు స్థిరంగా ఉండడంతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాల వృద్ధి వల్ల స్టార్టప్ సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ వృద్ధి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రిలయన్స్ వంటి కంపెనీలు వందల సంఖ్యలో వస్తాయన్నారు. జియోబ్లాక్‌రాక్ కార్యక్రమంలో అంబానీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచ వేదికపైనా భారత్ కీలక పాత్ర పోషిస్తోందని.. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని అంబానీ అన్నారు. దేశానికి స్థిరమైన రెండంకెల వృద్ధి సాధ్యమేనన్నారు. రాబోయే దశాబ్దంలో భారత్ ఇంధన రంగంలో దిగుమతులను దాదాపు 80శాతం తగ్గించుకుంటుందన్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రతి గ్రామంలో 5జీ నెట్‌వర్క్ ఉందని, అది కూడా ఇతర దేశాలతో పోలిస్తే చాలా చౌకగా లభిస్తోందని పేర్కొన్నారు.

## రామ్‌చరణ్ 'పెద్ది' వాయిదా ..కొత్త విడుదల తేదీ ఇదే



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సినిమా 'పెద్ది' . మార్చి 27న బాక్సాఫీసు ముందుకు రావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. తాజాగా కొత్త విడుదల తేదీని టీమ్ ప్రకటించింది. ఈ సినిమా ఏప్రిల్ 30న వస్తుందని తెలిపింది. ఈ మేరకు కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకుంది.'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదల తేదీని ప్రకటించిన కొన్ని క్షణాల్లోనే 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయడం గమనార్హం. పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది. మార్చి 26న రానుంది. నెల వ్యవధిలోనే బాబాయ్- అబ్బాయిల సినిమాలు విడుదల కానుండటంతో అభిమానులు ఆనందంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో- హీరోయిన్ కాంబినేషన్లతోపాటు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ (చరణ్ క్రికెట్ ఆడటం) సినిమాపై భారీ అంచనాలు పెంచింది.

# నేను ఎక్కువగా వాడే పదం అది

'నేను రోజూ ఎక్కువగా వాడే పదం ఐ లవ్ యు. అది కూడా నా కూతురి కోసమే" అని అంటోంది హిందీ తార దీపికా పదుకొణె. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేసే కథానాయికీమె. ప్రస్తుతం ఓవైపు తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన కుమార్తె గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "ఇప్పుడు నా ప్రపంచమంతా నా కూతురు దువా చుట్టూనే తిరుగుతుంది. ఆమె నాకు అన్నింటికన్నా ఎక్కువ" అంది. అలానే నేర్చుకోవడం అనేది రోజువారీ జీవితంలో భాగం కావాలని చెబుతోంది దీపిక. "కెరీర్ మొదట్లో పరిశ్రమను, కళను, మాధ్యమాన్ని అర్థం చేసుకోవడంపైనే ఉండేది. ఇప్పుడు పరిశ్రమలో మరింత మెరుగ్గా ఎలా రాణించాలో ఆలోచిస్తున్నా. అందుకే నేర్చుకోవడం ఎప్పుడూ ఆగకూడదు" అని చెప్పుకొచ్చింది దీపిక.





# ఒకే ఓటీటీలోకి 'మన శంకరవరప్రసాద్ గారు', 'పరాశక్తి'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?






సంక్రాంతి సందర్భంగా బాక్సాఫీసు ముందుకొచ్చి, ఘన విజయం అందుకున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ఓటీటీ విడుదలపై కొన్ని రోజులుగా చర్చ జరుగుతోంది. ఫిబ్రవరి తొలివారంలో 'జీ 5' లో స్ట్రీమింగ్ కానుందంటూ రూమర్స్ వచ్చాయి. దానిపై క్లారిటీ వచ్చింది. తమ ప్లాట్‌ఫామ్‌పై స్ట్రీమింగ్ చేయనున్న సినిమాల జాబితాను సదరు సంస్థ తాజాగా అప్‌డేట్ చేసింది. అందులోనే 'మన శంకరవరప్రసాద్ గారు', 'పరాశక్తి' సినిమాల వివరాలున్నాయి.

––ఏ సినిమా ఎప్పుడంటే?

చిరంజీవి హీరోగా తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్‌గారు'ను ఈనెల 11న , శివకార్తికేయన్ మూవీ 'పరాశక్తి'ని ఈనెల 7న రిలీజ్ చేయనున్నట్లుగా 'జీ 5' వివరాలను పొందుపరిచింది. ఓటీటీ సంస్థలు ముందుగా ఇలా యాప్/ వెబ్‌సైట్‌లో స్ట్రీమింగ్ వివరాలను పెడుతూ.. ఆ తర్వాత సోషల్ మీడియా వేదికగా ప్రకటిస్తుండటం గమనార్హం.

––రెండూ పండగ సినిమాలే..

అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు'లో మరో హీరో వెంకటేశ్ సందడి చేసిన సంగతి తెలిసిందే. అతి తక్కువ సమయంలో రూ.300 + కోట్ల కలెక్షన్లు రాబట్టిన ప్రాంతీయ సినిమాగా రికార్డు నెలకొల్పింది. జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. 'పరాశక్తి' విషయానికొస్తే.. శివ కార్తికేయన్, శ్రీలీల ప్రధాన పాత్రల్లో సుధా కొంగర తెరకెక్కించారు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం జనవరి 10న కేవలం తమిళంలో విడుదలైంది. తెలుగులోనూ రిలీజ్ చేయాలనుకున్నారుగానీ చేయలేదు. ఓటీటీలో తెలుగులో స్ట్రీమింగ్ అవుతుందా, లేదా? అన్నది తెలియాల్సి ఉంది.



# పవన్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'.. రిలీజ్ డేట్ ఫిక్స్

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' . ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. మార్చి 26న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లు. ఇప్పటికే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్ జరుగుతోంది. పవన్- హరీశ్ కాంబోలో ఇంతకుముందు వచ్చిన 'గబ్బర్‌సింగ్' ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' ను మార్చి 26న రిలీజ్ చేయనున్నట్లు గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న సినిమా అనుకున్న సమయానికి రాకపోవచ్చంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన లేదు. మరోవైపు, మార్చి 27న రావాల్సిన 'పెద్ది' వాయిదా పడింది. ఈ విషయాన్ని తాజాగా ప్రకటిస్తూ చిత్ర బృందం కొత్త తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 30న రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రమిది.

# 'వారణాసి'కి 'అవతార్'తో పోలిక.. రాజమౌళి ఏమన్నారంటే!

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు ఈరోజు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా కనిపించనున్నట్లు మహేశ్‌బాబు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు.

''నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది . ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం'' అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. ''అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను'' అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

--'వారణాసి'.. ప్రియాంక విజ్ఞప్తి ఇదే..

ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. తాజా ఇంటర్వ్యూలో ప్రియాంక తాను ఈ సినిమాను అంగీకరించేముందు రాజమౌళికి ఓ విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దాని గురించి ఆమె మాట్లాడుతూ.. ''నేను ఇండియన్ సినిమాలో నటించి 6 సంవత్సరాలు అయింది. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర చాలా గొప్పగా ఉంటుందని రాజమౌళి చెప్పినప్పుడు ఆయనకు ఒక విజ్ఞప్తి చేశా. 'దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పా. ఆయన చాలా పాటలు ఉన్నాయని చెప్పారు. మేం ఇప్పటికే ఒక పాట షూటింగ్ కూడా పూర్తి చేశాం. అది నాకు చాలా నచ్చింది. రోజూ దాన్ని పాడుకుంటూనే ఉన్నాను. అందులో డ్యాన్స్ అదిరిపోతుంది'' అని ప్రియాంక పంచుకున్నారు.



# చిత్రసీమలో విషాదం... నటి వాహిని కన్నుమూత

తెలుగు సినిమా రంగంలో మరో విషాదం చోటు చేసుకుంది. గత కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్ తో బాధపడుతున్న నటి వాహిని తుది శ్వాస విడిచారు. 1978లో జన్మించిన వాహిని, పలు తెలుగు, తమిళ చిత్రాలలో నటించారు. అలానే టీవీ సీరియల్స్ లోనూ కీలక పాత్రలు పోషించారు. బుల్లితెర వీక్షకులకు ఆమె జయ వాహిని పేరుతో పరిచయం. ఇటీవల విడుదలైన 'బహుర్భూమి' సినిమాలోనూ ఆమె నటించారు. నరేశ్ విజయకృష్ణ టైటిల్ పాత్ర పోషించిన 'రఘుపతి వెంకయ్య నాయుడు' చిత్రంలో ఆమె కథానాయికగా చేశారు. కొంతకాలంగా ఆమె క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో ఆమెకు ఆర్థిక సాయం చేయాల్సిందిగా నటి కరాటే కళ్యాణి తోటి కళాకారులను, నటీనటులను కోరారు. ఆమె అభ్యర్థనకు స్పందించిన కొందరు సాయం చేశారు. అయినా వాహిని ఆరోగ్యం కుదుటపడకపోగా మరింత విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్ళమన్నారని, అలా స్వస్థలం విజయనగరం వెళ్ళిన ఆమె బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారని కరాటే కళ్యాణి తెలిపారు.



# వారి ఆటగాళ్లకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అన్యాయం చేస్తోంది: కపిల్ దేవ్



టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరించడాన్ని తప్పు బట్టాడు. ఆ నిర్ణయం ఆ దేశ క్రికెట్‌నే నాశనం చేస్తుందని హెచ్చరించాడు. 'ఒకవేళ ఈ నిర్ణయం ఆటగాళ్లు తీసుకుంటే వాళ్లు ముందుకు వచ్చి చెప్పవచ్చు. కానీ ఆటగాళ్లు ఆడకూడదని బోర్డు నిర్ణయం తీసుకుంటే దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుంది' అని కపిల్ దేవ్ అన్నాడు. 'ఈ నిర్ణయం పాకిస్థాన్ ప్రగతికి ఏ మాత్రం దోహదపడదు. వారు పాక్ క్రికెట్‌ను చంపేస్తున్నారు. పాకిస్థాన్ నుంచి కొన్ని ఏళ్లుగా అద్భుతమైన క్రికెటర్లు వచ్చారు. వరల్డ్‌కప్ ఆడకుండా వారిని అడ్డుకోవడం సమంజసం కాదు. వారి సొంత ఆటగాళ్లకే వారు అన్యాయం చేసినట్లవుతుంది' అని కపిల్ దేవ్ పేర్కొన్నాడు. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత లేదన్న సాకుతో బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని చివరి నిమిషంలో ఐసీసీ (ICC) మీద ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. భారత్‌లో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు లేనందున ఐసీసీ.. బంగ్లా వాదనను తోసిపుచ్చింది. దీంతో బంగ్లాదేశ్ వరల్డ్‌కప్ నుంచి తప్పుకోవడంతో దాని స్థానంలో స్కాట్లాండ్‌ను ఐసీసీ ఎంపిక చేసింది.
దీంతో బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించనున్నట్లు చెప్పింది. అయితే ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ అధికారికంగా ఐసీసీ దృష్టికి తీసుకుపోలేదు. అయినా జరగబోయే పరిణామాలపై ఐసీసీ పాక్‌ను హెచ్చరించింది. పాకిస్థాన్ నిర్ణయం క్రీడాస్ఫూర్తికి విరుద్ధం. ఎంపిక చేసిన మ్యాచ్‌లు మాత్రమే ఆడతాననడం సమంజసం కాదని పేర్కొంది. ఒకవేళ పాక్.. గ్రూప్ స్టేజ్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే.. నెట్ రన్‌రేట్ పరంగా వెనకబడుతుంది. అలాగే మ్యాచ్ పాయింట్లు కూడా భారత్‌కు వస్తాయి. దీంతో మెగాటోర్నీలో పాక్ ముందుకుసాగని పరిస్థితి వస్తుంది. ఆర్థికంగానూ పాక్ క్రికెట్ బోర్డ్ తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. ఐసీసీ నుంచి నిషేధాన్ని సైతం ఎదుర్కొనే ప్రమాదమూ ఉంది.

# పాక్ వివాదంపై గౌతమ్ గంభీర్ ఏమన్నాడంటే!



టీ 20 వరల్డ్ కప్ (ICC Mens T20 World Cup) 2026 మరికొన్ని రోజుల్లోనే భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే.. గ్రూప్ స్టేజ్‌లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను తాము బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (PCB) ఈ విషయాన్ని ఐసీసీకి (ICC) అధికారికంగా తెలపలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత్, పాక్ మ్యాచ్‌పై అనిశ్చితి నెలకొంది. ఈ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ నిరాకరించాడు. ఈ రోజు (బుధవారం) భారత్, దక్షిణాఫ్రికాల మధ్య వార్మప్ మ్యాచ్ జరగనుంది. దీనికోసం అతడు ముంబయి బయలుదేరాడు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో విలేకరులు గౌతమ్‌కు పాక్ వివాదంపై ప్రశ్నలు సంధించారు. అయితే అతడు సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి ముందుకు కదిలాడు. పాకిస్థాన్ ప్రభుత్వం తమ క్రికెట్ జట్టు.. వరల్డ్ కప్ ఆడేందుకు అనుమతి ఇచ్చింది. కానీ.. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మాత్రం ఒప్పుకోలేదు. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఐసీసీ ఇప్పటికే పీసీబీకి హెచ్చరికలు జారీ చేసింది. రెవెన్యూపరంగా భారత్, పాక్ మ్యాచ్‌కు ప్రాధాన్యమున్న విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్, నమీబియా, నెదర్లాండ్, యూఎస్ఏ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్.. ఫిబ్రవరి 15న కొలంబోలో తలపడాల్సిఉంది. మరికొన్ని గంటల్లోనే భారత్ దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ ఐర్లాండ్ వార్మప్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

# భారత్ ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకొంటుందా? ధోని సమాధానం ఇదే..



పొట్టి ప్రపంచకప్ నేపథ్యంలో.. భారత జట్టుపై టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత్ అత్యంత ప్రమాదకరమైన జట్టు అని అభివర్ణించాడు. ఎవరు ఏ పాత్ర పోషించాలో జట్టులోని సభ్యులకు స్పష్టంగా తెలుసన్నాడు. ఒత్తిడిలో ఆడిన అనుభవం టీమ్ ఇండియాకు ఉందని ఓ కార్యక్రమంలో ధోని అన్నాడు. 'అత్యంత ప్రమాదకరమైన జట్లలో టీమ్ఇండియా ఒకటి. వాళ్లు ఇప్పటికే బ్యాటింగ్, బౌలింగ్ ప్రారంభించారు. మంచి జట్టుకు ఏమేం కావాలో.. అవన్నీ టీమ్ఇండియాలో ఉన్నాయి' అని ధోని కొనియాడాడు. 'జట్టులోని సభ్యులకు అనుభవముంది. ఈ ఫార్మాట్లో అదే అత్యంత కీలకం. వారు ఒత్తిడిని తట్టుకోగలరు. జట్టు కోసం ఎవరు ఎలాంటి పాత్రలు పోషించాలో వారికి బాగా తెలుసు' అని ధోని పేర్కొన్నాడు. అలాగే డ్యూ(మంచు) విషయంలో టీమ్ఇండియాకు కొన్ని హెచ్చరికలూ చేశాడు. 'నన్ను ఆందోళనకు గురిచేసే అంశం ఏంటంటే డ్యూ. అదంటే నాకిష్టం లేదు. డ్యూ చాలా విషయాలను ప్రభావితం చేస్తుంది. నేను ఆడుతున్న సమయంలోనూ డ్యూ అంటే నేను భయాందోళనకు గురయ్యా. ఇలాంటి సమయంలో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది' అని మహేంద్ర సింగ్ ధోని అన్నాడు. టీ20 ప్రపంచకప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. 2024 పొట్టి ప్రపంచకప్ తర్వాత టీమ్ఇండియా 32 టీ20 మ్యాచ్‌లు ఆడితే.. కేవలం 5 మ్యాచుల్లో మాత్రమే ఓటమి పాలైంది. టీమ్ఇండియా ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో పొట్టిఫార్మాట్లో టాప్‌లో కొనసాగుతుంది. అలాగే అభిషేక్ శర్మ నం.1 బ్యాటర్‌గా, వరుణ్ చక్రవర్తి లీడింగ్ టీ20 బౌలర్‌గా ఉన్నారు.

# అండర్19 వరల్డ్ కప్.. 311 ఉఫ్..

## ఫైనల్‌కు టీమ్ఇండియా



అండర్19 వన్డే ప్రపంచ కప్ 2026లో భారత్ అజేయంగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన సెమీ ఫైనల్‌లో టీమ్ఇండియా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ టార్గెట్‌ని యువ భారత్ 41.1 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించగా.. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62; 59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), విహాన్ మల్హోత్రా (38*) రాణించారు. శుక్రవారం (ఫిబ్రవరి 6) జరగనున్న ఫైనల్‌లో భారత్, ఇంగ్లాండ్ తలపడనున్నాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ ఫైజల్ షినోజాదా (110; 93 బంతుల్లో 15 ఫోర్లు), నాలుగో స్థానంలో వచ్చిన ఉజైరుల్లా (101*; 86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు బాదారు. ఓపెనర్లు ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) ఫర్వాలేదనిపించారు. షినోజాదా, ఉజైరుల్లా మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం (130 బంతుల్లో) నెలకొల్పారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. అంబరీష్ వేసిన 44 ఓవర్‌లో ఉజైరుల్లా వరుసగా 6, 4, 4, 4 బాదేశాడు. ఆ ఓవర్‌లో 21 పరుగులొచ్చాయి. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అండర్ 19 ప్రపంచ కప్‌లో ఇదే అత్యధిక లక్ష్యఛేదన కావడం విశేషం. ఇప్పటివరకు 16 ప్రపంచ కప్‌లు జరగ్గా.. భారత్ 10 సార్లు ఫైనల్‌కు చేరింది. టీమ్ఇండియా ఇప్పటి వరకు అయిదుసార్లు టైటిల్ గెలిచి టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా కొనసాగుతోంది.

# నేను కామెంటేటర్‌గా ఎందుకు చేయనంటే..: ఎంఎస్ ధోని



టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ఓ కార్యక్రమంలో క్రికెట్ కామెంట్రీ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. కామెంటేటర్‌గా చేయొచ్చు కదా అన్న ప్రశ్నకు ధోని సమాధానం ఇచ్చాడు. గణాంకాలు పెద్దగా గుర్తుండవని, అందుకే ఆ పని చేయలేనన్నాడు. 'గణాంకాలు గుర్తుంచుకోవడం నాకు చాలా కష్టం. ఆటను వర్ణించడం, ఆటగాళ్లను విమర్శించడం మధ్య సన్నటి గీత మాత్రమే ఉంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా మ్యాచ్ సమయంలో వ్యాఖ్యానం చేయడం కళ' అని ధోని అన్నాడు. 'మ్యాచ్ సందర్భంగా.. ఓ టీమ్ ఓడిపోవడానికి గల కారణాలను విశ్లేషించేటప్పుడు ఎవరూ నొచ్చుకోకుండా చెప్పగలగాలి. అలాగే నా కన్నా చాలా మందికి గణాంకాలపై మంచి పట్టు ఉంది. మీరు నా గణాంకాల గురించి అడిగినా కూడా చెప్పలేను' అని ధోని పేర్కొన్నాడు. అలాగే తనకు మాట్లాడటం కంటే కూడా, వినడం అంటేనే ఇష్టమని అన్నాడు. 'నేను చక్కగా వింటాను. నాకు సౌకర్యవంతంగా ఉన్న కొంతమందితో మాత్రమే మాట్లాడతాను. నేను మాట్లాడటం కంటే కూడా వినడానికి ఇష్టపడుతాను. నాకు అంతగా తెలియని టాపిక్ మీద ఎక్కువగా మాట్లాడను. ఎందుకంటే వింటే.. ఇంకాస్త ఎక్కువ విషయాలను గ్రహించగలుగుతా కదా' అని ధోని అన్నాడు. 'ప్రజలతో కమ్యునికేట్ అయ్యే నైపుణ్యం నాలో లేదు. నేను ఫోన్‌లో కంటే.. ఎదురుగా కూర్చుని ప్రజలతో మాట్లాడటానికి ఇష్టపడతాను. అందుకే ఫోన్ మాట్లాడే విషయంలో చాలా ఇబ్బంది పడతా. నేను ఇది మెరుగుపరుచుకోవాలనుకుంటున్న విషయం. కానీ నేను ఇందులో ఇంప్రూవ్ అవనందుకు సంతోషంగా ఉంది' అని ఎంఎస్ ధోని చమత్కరించాడు.

# వార్మప్ మ్యాచ్.. దక్షిణాఫ్రికాపై భారత్ విజయం





టీ20 ప్రపంచ కప్ 2026 కోసం జరిగిన వార్మప్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై భారత్ విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. ర్యాన్ రికెల్‌టన్ 44, స్టబ్స్ 45*, మార్‌క్రమ్ 38, జాసన్ స్మిత్ 35, మార్కో యాన్సెన్ 31 రన్స్ చేశారు. భారత బౌలర్లలో అభిషేక్ శర్మ 2 వికెట్లు పడగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబె, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్‌గా వచ్చిన ఇషాన్ కిషన్ (53 రిటైర్డ్ హర్ట్; 20 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వన్‌డౌన్‌లో వచ్చిన తిలక్ వర్మ (45; 19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. సూర్యకుమార్ యాదవ్ (30), అభిషేక్ శర్మ (24 రిటైర్డ్ హర్ట్), అక్షర్ పటేల్ (35*), రింకు సింగ్ (16) రాణించారు. చివర్లో హార్దిక్ పాండ్య (30; 10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో యాన్సెన్, కార్బిన్ బాష్, నోకియా, మఫాకా తలో వికెట్ పడగొట్టారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్..

## ఏకంగా 32 స్థానాలు ఎగబాకిన ఇషాన్ కిషన్



ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ ఇషాన్ కిషన్ ఏకంగా 32 స్థానాలు ఎగబాకాడు. ప్రస్తుతం అతను 32వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో టీ20లో ఇషాన్ 43 బంతుల్లోనే 103 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. అభిషేక్ శర్మ అగ్రస్థానంలో, ఫిల్ సాల్ట్ రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. తిలక్ వర్మను వెనక్కినెట్టి జోస్ బట్లర్ నాలుగో స్థానానికి వచ్చాడు. పాథుమ్ నిశాంక, సూర్యకుమార్ యాదవ్ ఒక్కో స్థానం మెరుగై వరుసగా ఐదు, ఆరు ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి టాప్‌లో కొనసాగుతుండగా.. అర్ష్‌దీప్ సింగ్ రెండు స్థానాలు మెరుగై 14వ ర్యాంకుకు చేరుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండు స్థానాలు దిగజారి 15వ ర్యాంకుకు పడిపోయాడు. అక్షర్ పటేల్ మూడు స్థానాలు జంప్ చేసి 17వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. పాక్ ప్లేయర్ సైమ్ ఆయూబ్ ఒక స్థానం మెరుగై టాప్‌లోకి రాగా.. హార్దిక్ పాండ్య మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. శివమ్ దూబె రెండు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు వచ్చాడు.

# పాకిస్థాన్.. దానికదే పెద్ద శత్రువు

–టీమ్ఇండియా మాజీ క్రికెటర్



టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026 ముంగిట పాక్ వివాదం వేళ టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. నాలుగైదు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందన్నాడు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించిన విషయం తెలిసిందే. 'నూటికి నూరుశాతం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుంది. మరో నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది. భారత్, పాక్ పోరును చూడాలని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. ఒకవేళ పాకిస్థాన్.. భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే జరగబోయే పరిణామాల గురించి అశ్విన్ ప్రస్తావించాడు. 'పాకిస్థాన్ భారీ ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. బ్రాడ్‌కాస్టర్లు పెద్ద మొత్తాల్లో నష్టపోతారు. మిగతా బోర్డులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఐసీసీ (ICC) మీటింగ్‌లో ఈ విషయం ప్రస్తావనకు వస్తుంది. పీఎస్ఎల్ కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్ఓసీలు రావు' అని అశ్విన్ విశ్లేషించాడు. 'భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో పోటీ పడుతున్నాయి. దీంతో ఇక్కడ వేదిక అనేది సమస్యే కాదు. కాబట్టి ఓ ప్రత్యర్థితో నేను ఆడను అనడం ఆమోదయోగ్యం కాదు. పాకిస్థాన్‌కు పాకిస్థానే పెద్ద శత్రువు. దీనంతటికీ వారి మైండ్‌సెట్టే కారణం' అని రవిచంద్రన్ అశ్విన్ పేర్కొన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్నాయి. ఈ మెగా టోర్నీలో మొత్తం 20 దేశాల జట్లు పాల్గొనబోతున్నాయి.

# ఆసియా షూటింగ్.. మెరిసిన ఇషా

–వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4) యూ అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఏడో స్థానంలో నిలిచింది. మహిళల టీమ్ విభాగంలో సురుచి (576), ఇషా (575), మను (575)లతో కూడిన భారత జట్టు (1726) పసిడి కైవసం చేసుకుంది. వియత్నాం (1713) రజతం, చైనీస్ తైపీ (1711) కాంస్యం గెలిచాయి. పురుషుల 10 మీటర్ల పిస్టల్‌లో సామ్రాట్ రాణా కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో 220.3 పాయింట్లతో అతడు మూడో స్థానంలో నిలిచాడు. వెచ్నికోవ్ (ఉజ్బెకిస్థాన్, 242), రకీమ్‌జాన్ (కజకిస్థాన్, 241) తొలి రెండు స్థానాలు సాధించారు. టీమ్ విభాగంలో సామ్రాట్ (581), శ్రవణ్ (578), వరుణ్ తోమర్ (573)లతో కూడిన భారత్ బృందం (1732) రెండో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ (1732) కూడా అన్నే పాయింట్లు సాధించినా.. మధ్య వృత్తానికి సమీపంగా ఎక్కువ పదులు స్కోరు చేయడంతో స్వర్ణాన్ని గెలుచుకుంది. కజకిస్థాన్ (1731) మూడో స్థానంలో నిలిచింది.